కబీరు

# నాది దుఃఖంలేని దేశం

వాడ్రేవు చినవీరభద్రుడు



**NADI DUKHAM LENI DESAM**
(BEGAM DESH HAMARA)
**KABIR**
Compiled and translated by
**VADREVU CHINAVEERABHADRUDU**

December, 2017

Copies 500

**Rs.100/-**

Cover painting in watercolor
after a photograph by Venu Challa, USA
(www.flickr.com/photos/34288079@N08/albums)
& inside drawings:
Vadrevu Chinaveerabhadrudu.

Typesetting, layout & design
**Amrutha Graphics, Hyderabad**

Book printed at
**SAMANTHA GRAPHICS,** Hyderabad.

A publication of **Sriprachurana**
Published by
**Dr. P. VIJAYASREE**,
89, Navodaya colony, Mehidipatnam, Hyderabad-28.

Sole distributors:
**ANALPA BOOK COMPANY**
Ground Floor, GK's Prashanti Nilayam, GK Colony, Main Road, Near
Neredmet X Road, Secunderabad, Telangana State-500 094,
+91 70938 00678.

# హంసని మేల్కొల్పుకున్నాను

**క**బీర్, నువ్వెప్పుణ్ణుంచీ బైరాగివయ్యావు, నీ ప్రేమప్రవృత్తి మొదలైందెప్పుడని అడిగాడు గోరఖ్‌నాథుడు.

కబీరిట్లా వివరించాడు.

ఇంకా ప్రపంచానికొక ఆకృతి అంటూ ఏర్పడని కాలంలో, అప్పటికింకా ఒక గురువూ, ఒక శిష్యుడూ అంటూ లేని కాలంలో, ఈ సంసారమిట్లా విస్తరించి ఉండని కాలంలో, ఆ పురుషుడొక్కడే నిలిచి ఉన్న కాలంలో, అప్పుడు గోరఖ్, నేను విరాగినయ్యింది, ఆయన తలపుల పట్ల నాలో ఇంత తదేకప్రేమ ప్రభవిల్లింది.

అప్పటికింకా సృష్టికర్త తలకి మకుటం తొడగలేదు, స్థితిపాలకుడింకా నొసట తిలకం దిద్దలేదు, లయకారకుడూ, గతికారకశక్తీ కూడా ఇంకా తలెత్తనే లేదు, అప్పుడు నేర్చుకున్నాను నేనీ యోగం.

సత్యయుగంలో మొదటిమెట్టుమీద నిలబడ్డాను, త్రేతాయుగంలో పతాక ఎగరేసాను, ద్వాపరయుగంలో కంకణం కట్టుకున్నాను, కలియుగంలో తొమ్మిది ఖండాలూ కలయదిరిగాను.

నా మొదటి రూపం నలుగురికీ పరిచయమయ్యింది కాశీలో. రామానందులు వెలిగించిన దీపమిది. సమర్థుణ్ణి ప్రమాణంగా తెచ్చుకున్నాను. ఈ హంసని మేల్కొల్పుకున్నాను.

ఎంతో సహజంగానూ, ఎంతో సరళంగానూ సంభవించే సంయోగమిది. ప్రేమ మేల్కొన్నది, పరవళ్ళు తొక్కుతున్నది, అనాహతనాదం వినిపిస్తున్నది, గోరఖ్, నువ్వు కూడా ఆ సంగీతంలో కలిసిపో.

# కబీర్ని కబీరుగా మార్చిందాయనే

1

నిలబెట్టాడు, నిలకడనిచ్చాడు, ఆయన నాకు ధైర్యాన్నిచ్చాడు. చూడు, ఇప్పుడు కబీరు మానససరోవరతీరాన వణిజుడైపోయాడు.

2

హరితో ఏమి పని నీకు? హరిజనులతో చెలిమి చెయ్యి. హరి నీకు విత్తమిస్తాడు, పెత్తనమిస్తాడు. హరిజనులు హరినే అందిస్తారు.

3

నాకు ఇద్దరు సన్నిహితులు, ఒకరు రాముడు, మరొకడు వైష్ణవుడు. ఒకరు నన్ను చెరవిడిపిస్తారు, మరొకరు ఆయన్ని తలపుకు తెస్తారు.

4

ఆయనే నా దుకాణందారు. నన్ను నన్నుగా ఉంచడమే ఆయన చేసే వ్యాపారం. తక్కెడలేదు, సిబ్బెల్లేవు. సమస్తసంసారాన్నీ తూచి పెడుతున్నాడు.

5

నేను చేసిందేమీ లేదు, చెయ్యగలిగేదీ లేదు. ఈ శరీరం కూడా దేనికీ తగిందీ కాదు. అయినా, నేనేదన్నా చేసివుంటే, అదంతా ఆయన చేసిన పనే. కబీర్ని కబీరుగా మార్చిందాయనే.

## నీ ప్రభువుని సహచరుడిగా స్వీకరించి

నీ ప్రభువుని సహచరుడిగా స్వీకరించి సుఖదుఃఖాలనుండి విముక్తి పొందు.

ఆయన దశరథుడి ఇంట్లో ప్రభవించలేదు. లంకలో రావణుణ్ణి సంహరించనూ లేదు. దేవకీ గర్భం నుంచి అవతరించలేదు. యశోద ఒడిలో చేరి క్రీడించనూ లేదు.

ఆయన గోపబాలకులతో చెలిమి చేయలేదు. గోవర్ధనగిరిని పైకెత్తలేదు. వామనుడై బలిని మోసపుచ్చలేదు. ధరణినీ, వేదాల్నీ సముద్ధరించే పని చెయ్యనే లేదు.

ఆయన గండకీ తీరంలో దొరికే సాలిగ్రామం కాదు. మత్స్య, కూర్మ, వరాహ రూపాలు ధరించినవాడూ కాడు.

బదరీక్షేత్రంలో ఆయన తపస్సు చేయలేదు. పరశురాముడై క్షత్రియుల్ని సంహరించనూ లేదు. ద్వారకాపురిలో శరీరం త్యజించలేదు. జగన్నాథంలో గద్దెనెక్కి కూచోనూలేదు.

బాగా ఆలోచించి ఆలోచించి కబీరు చెప్తున్నాడు: ఇవన్నీ మోసకారిమాటలు. వీటన్నిటికీ అతీతుడైనవాడే ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్నాడు.

# అది అతడి గుర్తు

**నా**కు లభ్యమయిందొక మనిషి కాదు, అది దేవుడూ కాదు. బ్రహ్మచారికాదు, శివారాధకుడూ కాదు. అది యోగి కాదు, అవధూత కాదు, దానికి తల్లి లేదు, అదెవరికీ సుతుడూ కాదు.

ఈ మందిరంలోనే నివసిస్తున్నది, అయినా, అదేమిటో, దాని ఎల్లలు తెలిసిన వారొకరూ లేరు.

అది గృహస్థు కాదు, సన్యాసి కాదు. రాజు కాదు, భిక్కు కాదు. పిండదేహంకాదు, శోణబిందువూ కాదు. అది బ్రాహ్మణుడు కాదు, క్షత్రియుడూ కాదు.

అది తపస్వి కాదు, షేకు కాదు. జీవించి ఉన్నదికాదు, మరణించినదీ కాదు. అది మరణించిందని దుఃఖించారా, అది వాళ్ళకే అమర్యాద.

ఆయన అనుగ్రహం వల్ల నాకు దొరకవలసింది దొరికింది. జీవించడానికీ, మరణించడానికీ మధ్య హద్దు చెరిగిపోయింది.

అది అతడి గుర్తు. కాగితం మీద సిరామరకను చెరిపినట్టు దాన్ని చెరపలేమంటున్నాడు కబీరు.

# ఇంటింటా ఒక దీపం

**ఇం**టింటా ఒక దీపం వెలుగుతున్నది. నువ్వు దాన్ని చూడలేకపోతే, సందేహంలేదు, నువ్వు అంధుడివే.

ఇప్పుడైనా చూపు తెచ్చుకో, నెమ్మదినెమ్మదిగా చూపుసారించు, యమపాశం నుంచి తప్పించుకో.

ప్రవచనాల వల్ల తెలిసేది కాదది, వింటే అర్థమయ్యేది కాదు. కర్మకలాపంతో చేతికి చిక్కేదికాదు. అది కనబడాలంటే, జీవించి ఉండగానే మరణించాలి. అట్లా మరణించావా, మరోసారి మరణించే పని ఉండదు.

అతణ్ణించి దూరమయ్యామని యోగులు విలపిస్తారు. ఆ ఇల్లెక్కడో దూరంగా ఉందనుకుంటారు. తామున్నది ప్రభుసన్నిధానంలోనే. అయినా ఇంటికప్పు ఎక్కి మరీ ఆయన కోసం వెతుక్కుంటారు.

బ్రాహ్మణుడు చూడు, ఇంటింటికీ తిరిగి మరీ ప్రతి ఒక్కడీ దీక్షనిస్తుంటాడు. ఆ ఆదిమధ్యాంతరహితుడు సజీవంగా పక్కనే నిలిచి ఉండగా, అదేమిటో, మనుషులతో రాళ్ళకి పూజలు చేయిస్తాడు.

ఎవరిని యోగం సమకూర్చలేదో, జపాలు సముపార్జించలేవో, పుణ్యం చేతికందించలేదో, పాపం దరిచేర్చలేదో, ఆ సుందరలావణ్యమూర్తికి కబీరు దాసానుదాసుడు.

# తలుచుకోడం ముఖ్యం

1

**తొ**లిప్రేమభావమే నామం, అదే అంతస్సారం. దాన్ని తెలుసుకున్నవాడు హంస. ఆ తలపులో ఎవడు లీనమైతే వాడు అమరకుటుంబంలో చేరిపోతాడు.

2

అతడి సారం సమస్తం అతడి పేరే. లోకానికి తిలకం లాంటిదది. దాన్ని కబీరు తన నొసట ధరించగానే ఒక శోభామూర్తిగా మారిపోయాడు.

3

చేసిన పాపాలూ వెయ్యి తులాల బరువు, నామం ఒక్క తులమే అనుకో, అది అరతులం నీలో ఇంకినా పాపాలన్నీ దహించి భస్మం చేసేస్తుంది.

4

తలుచుకోడం ముఖ్యం. సంతోషంగానా? దుఃఖంతోనా? అదేమంత ముఖ్యం కాదు. గింజ నిలువుగా పడ్డా, తల్లకిందులుగా పడ్డా, ఒకసారి పొలంలో విత్తాక మొలకెత్తే తీరుతుంది.

5

అన్ని రకాల రసాయనాలు పరీక్షించి చూసాను, అతడి తలపు వంటి రసాయనం మరొకటి కనబడలేదు. లేశమాత్రం లోపలదిగినా, దేహం మొత్తం కాంచనమైపోతుంది.

# నీళ్ళమధ్య కదలాడుతూనే

నీళ్ళమధ్య కదలాడుతూనే చేప దప్పిగొందట, ఈ విషయం విని విని నాకు నవ్వొస్తూంటుంది.

నువ్వెవ్వరో నీకు తెలియకపోతే తక్కిన జ్ఞానమంతా వృథా, ఇంక కాశీతో పనేమిటి? మధురతో పనేమిటి?

నువ్వు వెతుకుతున్నది ఇంట్లోనే ఉందని తెలుసుకోవు, బయటకి పోయి గాలిస్తుంటావు.

మృగనాభిలోనే కస్తూరి ప్రవిస్తున్నది, కాని మృగం అడవినుంచి అడవికి తిరుగాడుతూనే వున్నది.

సాధువులారా, కబీరు చెప్తున్నాడు వినండి, ఆ అవినాశసత్యం సాక్షాత్కరించేది మీరున్నచోటనే.

# రత్నం దొరికింది, కాని లెక్కలేదు

నీ స్వామి ఎలా ఉంటాడో నాకు తెలియదు.

మసీదులో ముల్లా బిగ్గరగా అరుస్తుంటాడు, ఏమీ! నీ స్వామి బయట వున్నాడా? చీమకాళ్ళ అడుగుల చప్పుడు కూడా వినగలడాయన.

పండితుడు ఆసనం బిగించి పొడవైన జపమాల తిప్పుతుంటాడు, కానీ నీ అంతరంలో కపటం ఒక కత్తెరలాగా పొంచిఉంటుందని పసిగట్టగలడు నా ప్రభువు.

కిందకీ, మీదకీ మహలు కడతారు, లోతుగా పునాది తీస్తారు, పోకతప్పదన్న ఆలోచనే లేదు, ఉండటం గురించే ఆలోచనసాగిస్తుంటారు.

గవ్వగవ్వగా మాయని కూడబెట్టావు, గొయ్యి తీసి పాతిపెట్టావు, అదెవడికి చెందాలో వాడు దాన్ని కొల్లగొట్టుకుపోయాడు, పాపి కొట్టుకుని కొట్టుకుని చస్తాడు.

నమ్ముకున్నామెకు ముతకచీర కూడా లేదు, వేశ్య మటుకు మేలిమి వస్త్రం ధరిస్తుంది. ఏ ఇంటిముంగిట సాధువు ఆకలితో నకనకలాడుతుంటాడో ఆ ఇంట్లో పిల్లవాడు మిఠాయి మింగుతుంటాడు.

రత్నం దొరికింది, లెక్కలేదు, గవ్వలు లెక్కపెట్టుకుంటున్నారు, సోదరులారా, కబీరు చెప్తున్నాడు, వినండి, ఆయన ఎవరికి తగ్గట్టు వారికి అర్థమవుతాడు.

# సంతులారా, సుజనులారా

సంతులారా, సుజనులారా, మీరు కపటజ్ఞానుల్ని నమ్ముతున్నారు.

మీ హృదయంలోనే ఒక దొంగలగుడారం, మిమ్మల్ని మీరు కాపాడుకోండి.
మన నెత్తి మీది అసత్యపు పైకప్పు అవనినీ, ఆకాశాన్నీ అవరించింది.
పదిదిక్కులా ఉచ్చు పన్నింది. జీవుణ్ణి పాశం తగులుకుంది.

జపతపాలూ, నియమనిష్టలూ, తీర్థాలూ, వ్రతాలూ, దానధర్మాలూ
నవవిధభక్తులూ, వేదమూ, కొరానూ అన్నీ అబద్ధపుముసుగులు.

ఒకడు తాను బాగా చెప్తున్నానంటాడు. మరొకడు తాను బాగా
చేస్తున్నానంటాడు. వాళ్ళని చూసుకుని వాళ్ళకెంత గర్వం.
హిందువులూ, తురకలూ, ఇద్దరూ అంతే.

స్వర్గం గురించి రొమ్మువిరుచుకు చెప్తారు, మృత్యువు పక్కనే పొంచిఉందని
చూడరు. తమని తాము చూసుకు మురిసిపోతారు, నీళ్ళు లేకుండానే
మునిగిపోతారు.

నిజంచెప్పేవాడికి దూరమవుతారు, అబద్ధాలు చెప్పేవాడికి దగ్గరవుతారు.
నేనెవరితో మాట్లాడేది? లోకమంతా గుడ్డిదయ్యిందంటున్నాడు కబీరు.

# అందరూ మత్తిల్లారు

**అం**దరూ మత్తిల్లారు, ఒకడికీ మెలకువలేదు. దొంగ పడ్డాడు, ఇల్లు దోచుకుంటున్నాడు.

యోగి ధ్యానంలో మత్తెక్కి ఉన్నాడు, పండితుడు పురాణాలు పఠిస్తూ మత్తిల్లాడు. తాపసి తపసులో మత్తెక్కి ఉన్నాడు, సన్యాసి అహంకారంలో ఆదమరిచాడు.

మౌల్వీ కొరాను చదువుతూ మత్తిల్లాడు, కాజీకి తీర్పులు తీర్చి తీర్చి మత్తెక్కింది. సకల సంసారం మాయాప్రవాహంలో మత్తిల్లింది.

రాజు అహకరించి మరీ మత్తిల్లాడు. శుకుడు, ఉద్ధవుడు, అక్రూరుడు మత్తిల్లారు. హనుమంతుడికి తోకచూసుకుని మత్తెక్కింది. శివుడు హరిచరణసేవలో మత్తిల్లాడు. కలియుగంలో జయనామదేవులు మత్తిల్లారు.

వేదపురాణాలు ఘోషిస్తున్న సత్యమొకటే, రావణుడు మరణించేది గృహభేదం వల్లనే. ఈ చంచలమనసు కెప్పుడూ నీచకామనలే, కాబట్టే అతడి పాదాలు వదలకుండా పట్టుకొమ్మంటాడు కబీరు.

## స్వర్గనివాసం పట్ల కోరిక లేదు

స్వర్గనివాసం పట్ల కోరిక లేదు, నరకనివాసం గురించి భయం లేదు. ఏమి జరగాలో అది జరిగితీరుతుంది. మనసుని ఆశల్లో ముంచితేల్చకు.

అతడి గుణాగానమే మన పరమనిధానం.

భగవంతుణ్ణి ప్రేమించడమెట్లానో తెలియకపోతే, ఆయనతో కలిసి ఉండటం చాతకాకపోతే జపాలెందుకు? తపాలెందుకు? స్నానాలెందుకు? నిష్ఠలెందుకు? నియమాలెందుకు?

సంపదలు కనిపించినప్పుడు సంతోషించకు, విపత్తు ఎదురయ్యిందని రోదించకు. అతడేమి సంకల్పించాడో అదే నడుస్తున్నప్పుడు సంపదలూ, విపత్తులూ రెండూ ఒకటే.

సాధువుల హృదయంలో ఉండేదెవడో తనకి తెలిసిందంటున్నాడు కబీరు. ఏ సేవకుడి హృదయాన్ని ప్రభువు స్వంతం చెసుకుంటాడో వాడే నిజమైన సేవకుడు.

# విరహభుజంగం

1

**వి**రహభుజంగం తనువులో చొరబడింది, దాన్నే మంత్రమూ మరిపించలేదు.
ఆయన్ని ఎడబాసాక బతకడం కష్టం, బతికినా పిచ్చిపట్టడం ఖాయం.

2

విరహభుజంగం దేహంలో దొరబడింది. నా అంతరాంతరాల్ని తినేస్తోంది.
సాధువు మాత్రం రవ్వంతైనా చలించడు, నీకిష్టమొచ్చిన చోట కాటు వేసుకొమ్మంటాడు.

3

భవసాగరం నుంచి బయటపడటానికి తెప్పలాగా ఒక పాము దొరికింది.
వదిలిపెట్టానా, మునిగిపోతాను. పట్టుకున్నానా, కాటువేస్తుంది.

4

నిన్న నువ్వు ఏ శరంతో నన్ను గాయపరిచావో ఆ శరం నాకెంతో ప్రీతిపాత్రమైపోయింది. మళ్ళా ఈ రోజు కూడా ఆ బాణంతో నా గుండె చీల్చు, ఆ శరంతగలకపోతే హృదయానికి సుఖం లేదు.

5

విరహం, విరహమని నిందించకు. విరహం సులతాను. విరహం లేని దేహం వట్టి మన్ను, మశానం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nadi+Dukham+Leni+Desam**

* * *